సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 28 । జూలై । 2024



పెరుగుతున్న నీటిమట్టాలు

ఆంధ్రా ఒడిశా రాష్ట్రాల సరిహద్దుల్లో కురుస్తున్న వర్షాలకు దుడుమ, జోలాపుట్టు జలాశయాల్లో భారీగా వరదనీరు చేరుతోంది. 8లో



స్పెషల్ రైళ్ల పొడిగింపు

ప్రస్తుతం నడుస్తున్న స్పెషల్ రైళ్లు మరింత కాలం పొడిగిస్తున్నట్టు వాల్తేర్ డివిజన్, సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. 8లో



నేత్రపర్వంగా నిత్య కల్యాణం

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి నిత్యకల్యాణం శనివారం నేత్రపర్వంగా నిర్వహించారు.

న్యూస్‌రీల్

జిల్లాలో 572.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు

సాక్షి, పాడేరు: జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు శనివారం 572.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ముంచంగిపుట్టులో 72.6, చింతూరులో 60.2, కూనవరంలో 47.4, ఎటపాకలో 44.6, పెదబయలులో 35, రంపచోడవరంలో 30.4, డుంబ్రిగుడలో 28.2, జి.కె.వీధిలో 27.4, మారేడుమిల్లిలో 25.4, జి.మాడుగులలో 26.8, పాడేరులో 20.8, దేవీపట్నంలో 20.4,అడ్డతీగలలో 18.6, గంగవరంలో 18.6, అరకులోయలో 18.4, వై.రామవరంలో 16.2,వా హుకుంపేటలో 16, అనంతగిరిలో 12.6, వీఆర్‌పురంలో 12.8, రాజవొమ్మంగిలో 9.2, చింతపల్లిలో 5.8, కొయ్యూరులో 5.2 మిల్లీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది.

సీలేరు జలవిద్యుత్ కేంద్రంలో పెరుగుతున్న ఉత్పత్తి

- వినియోగంలోకి రెండో నంబర్ యూనిట్



వినియోగంలోకి వచ్చిన యూనిట్

సీలేరు: స్థానిక జల విద్యుత్ కేంద్రంలో రెండో నంబర్ యూనిట్ శనివారం నుంచి వినియోగంలోకి వచ్చిందని ఈఈ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు యూనిట్‌కు సంబంధించిన బస్‌టెక్‌లో నీరు చిమ్మి విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం కలిగింది. దీంతో అధికారులు యూనిట్‌ను తక్షణ చర్యలు చేపట్టి వినియోగంలోకి తెచ్చారు. 60 మెగావాట్ల మేర ఉత్పత్తి జరుగుతున్నట్టు అధికారులు తెలిపారు. నాలుగో నంబరు యూనిట్ కూడా మరో 24 గంటల్లోగా వినియోగంలోకి వచ్చేలా వారు చర్యలు చేపట్టారు.

కల్లు కోసం సాహసం

- థర్మాకోల్ సీట్లతో తెప్ప తయారీ
- వరద నీటిలో చెట్టువద్దకు వెళ్లి సేకరణ



థర్మాకోల్ సీట్లతో తయారుచేసిన తెప్పపై వరదనీటిలో చెట్టువద్దకు వెళ్తున్న వీరయ్య

చింతూరు: మండలంలోని చట్టికి చెందిన వీరయ్య అనే వ్యక్తి తాటికల్లు కోసం వరదనీటిలో పెద్ద సాహసమే చేశాడు. అతను ప్రతిరోజూ తన తాటిచెట్టు నుంచి కల్లుగీసి సేవిస్తుంటాడు. కాగా శనివారం వరదనీరు అతని చెట్టును చుట్టుముట్టడంతో అక్కడికి వెళ్లేందుకు దారిలేకుండా పోయింది. దీంతో అతనికి ఓ ఐడియా తట్టింది. థర్మాకోల్ సీట్లతో నావ మాదిరిగా ఓ తెప్ప, బాక్సును తయారు చేశాడు. దానిపై తాటి బలగాల సాయంతో వరదనీటిలో తోసుకుంటూ చెట్టువద్దకు వెళ్లి తాటికల్లును సేకరించి ఇంటికి తీసుకువెళ్లాడు.

360 గ్రామాలకు నిలిచిన విద్యుత్ సరఫరా

- చెట్టు కూలడంతో విరిగిన స్తంభాలు



రంపచోడవరం సబ్ స్టేషన్‌లో విరిగిన విద్యుత్ స్తంభాలు

రంపచోడవరం: స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయానికి సమీపంలో భారీ వృక్షం కూలిపోవడంతో 33 కేవీ విద్యుత్ లైన్ తెగిపోయింది. దీంతో సబ్ స్టేషన్‌లో స్తంభాలు విరిగిపోయాయి. గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలాల్లో దాదాపుగా 360 గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు ట్రాన్స్‌కో అధికారులు చర్యలు చేపట్టారు.



అడవివెంకన్నగూడెంలో వరద నీరు ఇళ్లలోకి చేరడంతో సమీప ఎత్తు ప్రాంతంలో గుడారాలు వేసుకుంటున్న గ్రామస్తులు



చింతూరులో వరద పెరుగుతుండటంతో ఇళ్లను ఖాళీచేసి ట్రాక్టర్‌పై సామానులు తరలిస్తున్న బాధితులు



చింతూరు మండలం చట్టివద్ద ఆంధ్రా, తెలంగాణ జాతీయ రహదారి-30పై భారీగా నిలిచిపోయిన వరదనీరు

తగ్గినట్టే తగ్గి.. మళ్లీ ముంచెత్తి..



భద్రాచలం వద్ద 53 అడుగులు దాటిన గోదావరి నీటిమట్టం

వారం రోజులుగా పోటెత్తుతున్న గోదావరి, శబరి నదుల వరద ఉధృతికి విలీన మండలాలు చిగురుటాకుల్లా వణుకుతున్నాయి. నాలుగు రోజుల క్రితం రెండో ప్రమాద హెచ్చరికకు చేరిన గోదావరి నీటిమట్టం క్రమేపీ తగ్గుముఖం పట్టడంతో ఎటపాక, చింతూరు, కూనవరం, వీఆర్‌పురం మండలాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఇంతలోనే ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల వరద నీటికి ఉభయ నదులు మళ్లీ పోటెత్తాయి. దీంతో వరదనీరు ముంచెత్తడంతో వందలాది గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ప్రధాన, అంతర్గత రహదారులు నీటమునిగాయి. గ్రామాలు ద్వీపాలను తలపిస్తున్నాయి. ముంపు ప్రాంతాల ప్రజలంతా ప్రాణాలరజేత పట్టుకుని సురక్షిత ప్రాంతాలకు తరలిపోతున్నారు.

- పోటెత్తిన గోదావరి, శబరి వరద
- భద్రాచలం వద్ద రాత్రి పది గంటలకు 53.8 అడుగులకు చేరిన నీటిమట్టం
- దిగువకు 14.26 లక్షల క్యూసెక్కుల విడుదల
- మూడవ ప్రమాద హెచ్చరిక జారీతో విలీన మండలాల్లో ఆందోళన
- జలదిగ్బంధంలో గ్రామాలు
- నీటమునిగిన జాతీయ, అంతర్గత రహదారులు

ఎటపాక: గోదావరికి మళ్లీ వరద పోటెత్తింది.తగ్గుముఖం పట్టిన నీటిమట్టం శనివారం భారీగా పెరిగి ఉగ్రగోదావరిగా మారింది. భద్రాచలం వద్ద గోదావరి వరద శనివారం రాత్రి పది గంటలకు 53.8 అడుగులకు చేరుకోవడంతో మూడవ ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. గత వారం రోజుల వ్యవధిలో మూడు సార్లు రెండవ ప్రమాద హెచ్చరిక జారీ అయింది. శనివారం సాయంత్రానికి గ్రామాలను వరద నీరు చుట్టుముట్టడంతో ప్రజలు తీవ్ర భయాందోళన చెందుతున్నారు. నీటిమట్టం పెరుగుతున్న నేపథ్యంలో భద్రాచలం వద్ద దిగువకు 14.26 లక్షల క్యూసెక్కుల వరదనీరు వెళ్తోంది. వరద ఉధృతి మరింత పెరిగే అవకాశం ఉందన్న సమాచారంతో విలీన మండలాల అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

- ఎగువున ఉన్న తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల తాలిపేరు ప్రాజెక్టు నుంచి 25 గేట్లు పూర్తిగా ఎత్తి 1.26 లక్షల క్యూసెక్కుల వరద నీటిని గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. పాల్వంచలోని కిన్నెరసాని ప్రాజెక్ట్ నుంచి కూడా వరద నీరు గోదావరిలో భారీగా చేరుతోంది.
- వరదనీరు గ్రామాలను చుట్టుముట్టడంతో భద్రాచలం నెల్లిపాక వచ్చే జాతీయరహదారి రాయనపేట వద్ద నీట మునిగింది. ఎటపాక నుంచి చర్ల వెళ్లే రహదారి చెన్నంపేట వద్ద ముంపునకు గురైంది.



ఎటపాక మండలం రాయనపేట వద్ద జాతీయ రహదారిని ముంచెత్తిన వరదనీరు

- నెల్లిపాక నుంచి కూనవరం వెళ్లే ప్రధాన రహదారి నెల్లిపాక, తోటపల్లి, గొరిదేవిపేట, నందిగామ, మురుమూరు వద్ద వరదనీరు ముంచెత్తింది. దీంతో మండలంలోని పలుగ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ముంపు గ్రామాల ప్రజలు సామగ్రిని మూటలు కట్టి సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్తున్నారు.

అనూహ్యంగా పెరుగుతూ..

చింతూరు: ఈ ప్రాంతంలో శనివారం ఉదయం 8 గంటల వరకు తగ్గుతూ వచ్చిన శబరినది తొమ్మిది గంటల అనంతరం అనూహ్యంగా పెరిగింది. శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎగువనున్న ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి వస్తున్న వరదనీటితో పాటు డొంకరాయి జలాశయం నుంచి పది వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయడం వల్ల శబరినది ఉధృతి భారీగా పెరుగుతోంది. శనివారం రాత్రికి చింతూరు వంతెన వద్ద శబరినది నీటిమట్టం 42 అడుగులకు చేరుకోవడంతో వరదనీరు క్రమేపీ గ్రామాల్లోకి ప్రవేశిస్తోంది. దీంతో మండలంలోని ఉలుమూరు, ఏజీకొడేరు, మల్లెతోట, చింతూరు, చట్టి, కుమ్మూరు గ్రామాలకు చెందిన 5,200 కుటుంబాలను వివిధ పాంతాల్లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రాలకు తరలించినట్లు తహసీల్దార్ నజీముల్లాషా తెలిపారు.

- **మండలంలోని చట్టివద్ద ఆంధ్రా, తెలంగాణ జాతీయ రహదారి-30పై శనివారం ఉదయం వరకు రాకపోకలు కొనసాగాయి. మళ్లీ వరద నీరు ముంచెత్తడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఆంధ్రా, ఒడిశా జాతీయ రహదారి-326పై కూడా** వరద మరింత పెరగడంతో రాకపోకలు పునరుద్ధరణ కాలేదు.

35 గ్రామాలకు స్తంభించిన రాకపోకలు

చింతూరు నుంచి కూనవరం మండలానికి కూడా మళ్లీ రాకపోకలు నిలిచిపోయాయి. చంద్రవంక, సోకిలేరు, జల్లివారిగూడెం, కుయిగూరు, చీకటివాగుల వరదనీరు రహదారులపై నిలిచి ఉండటంతో చింతూరు మండలంలోని 35 గ్రామాల దారులు మూసుకుపోయాయి.

నిర్లక్ష్యంగా సిబ్బంది పనితీరు

- వరద ప్రభావిత ప్రాంతాల్లో వాగుల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. శనివారం చింతూరు మండలం చట్టివద్ద జాతీయ రహదారి-30పై వరదనీరు భారీగా నిలిచివున్న క్రమంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓవ్యక్తి ప్రమాదకరంగా వాగు దాటాడు. ఇలాంటి సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాల్సిన సిబ్బంది పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. దీనిపై చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య దృష్టికి తీసుకెళ్లగా వాగుల వద్ద పోలీసులు కాపలా ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఉభయ నదుల ఉగ్రరూపం



వరద ముంచెత్తడంతో రేఖపల్లి పునరావాస కేంద్రానికి పడవలపై వెళ్తున్న వడ్డిగూడెం వాసులు

వీఆర్‌పురం: గోదావరి వరదకు శబరి నది ఉధృతి తోడైంది. దీంతో ఉభయ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నందున ముంపు ప్రభావిత గ్రామాల ప్రజల్లో భయాందోళన నెలకొంది. శబరి నదికి ఎగువున ఉన్న డొంకరాయి డ్యామ్ నాలుగు గేట్లు ఎత్తి దిగువకు 8,748 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

శబరి నది ఎగువన కూడా వర్షాలు భారీగా వర్షాలు కురుస్తుండంతో నది ప్రవాహ ఉధృతి అంచనాకు అందడంలేదు. శబరి బ్రిడ్జికి సమీపంలోని ధర్మతాళ్లగూడెం వద్ద వరద నీరు రహదారిపైకి చేరడంతో కూనవరం-వీఆర్‌పురం మండలాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. అలాగే ధర్మతాళ్లగూడాన్ని వరద నీరు చుట్టుముట్టింది.

ముంపులో వడ్డిగూడెం

వీఆర్‌పురానికి సమీపంలోని వడ్డిగూడెం కాలనీలోకి సైతం వరదనీరు చేరి ఇళ్లను ముంచెత్తింది. దీంతో ఈ ప్రాంతీయులు పడవల ద్వారా రేఖపల్లిలోని పునరావాస కేంద్రాలకు తరలి వెళుతున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 30 గ్రామాలు వరద ప్రభావానికి గురయ్యాయి. 40 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. బాహ్య ప్రంపంచడంతో మండలంలోని గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. పునరావాస కేంద్రాలను సందర్శించి వరద పరిస్థితిని ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు నివేదిస్తున్నట్టు తహసీల్దార్ సయ్యద్ మౌలానాఫాజిల్ తెలిపారు.



శబరి బ్రిడ్జి వద్ద రహదారిని ముంచెత్తిన వరదనీరు



వడ్డిగూడెం కాలనీలోకి చేరిన వరద నీరు

గుంటవాడ జలాశయానికి వరద తాకిడి

- ప్రమాదస్థాయికి నీటిమట్టం
- ఏక్షణంలోనైనా గేట్లు ఎత్తే అవకాశం
- పరిసర ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసిన జెన్‌కో అధికారులు



వరదనీటితో గుంటవాడ జలాశయం

సీలేరు: ఆంధ్రా-ఒడిశా సరిహద్దుల్లో గత 20 రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు గుంటవాడ జలాశయ నీటిమట్టం ప్రమాదస్థాయికి చేరుకుంది. దీంతో జెన్‌కో అధికారులు అప్రమత్తమయ్యారు. ఏక్షణంలోనైనా గేట్లు ఎత్తే అవకాశం ఉన్నందున పరిసర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా ప్రాజెక్ట్ ఇన్‌చార్జి ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ శుక్రవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు రిజర్వాయర్‌లోకి భారీగా వరద నీరు చేరుతోందన్నారు. పూర్తి స్థాయి నీటిమట్టం 1360 అడుగులు కాగా, శనివారం 1359 అడుగులకు చేరిందన్నారు. శనివారం ఒక్కరోజే అడుగు మేర నీరు చేరిందన్నారు. ప్రస్తుతం జల విద్యుత్ కేంద్రంలో రెండో నంబర్ యూనిట్ అందుబాటులోకి రావడంతో విద్యుతుత్పత్తి ఎక్కువగా జరుగుతోందన్నారు. ఇందుకుగాను ఐదు వేల క్యూసెక్కులు విద్యుత్ ఉత్పత్తికి విడుదల చేస్తున్నామని తెలిపారు. వర్షాలు కొనసాగితే పిల్లిగెడ్డ వాగునుంచి భారీగా వరదనీరు చేరే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.

గిరిజనుల సాహసం

- గర్భిణిని మోసుకుని వాగు దాటించి ఆస్పత్రికి తరలింపు



గర్భిణిని వాగు దాటిస్తున్న గిరిజనులు

చింతపల్లి (సాక్షి, పాడేరు): పురిటి నొప్పులతో బాధపడుతున్న నిండు గర్భిణిని వాగు దాటించి ఆస్పత్రికి తరలించారు. మండలంలోని మారుమూల గ్రామం బూరుగుబయలుకు చెందిన గర్భిణి కళావతి శనివారం పురిటినొప్పులతో బాధపడుతోంది. అయితే ఆమెను ఆస్పత్రికి తరలించేందుకు బూరుగుబయలు-బండ్రేవ్ గ్రామాల మధ్య వాగు ఉధృతంగా ప్రవహించడంతో అడ్డంకిగా మారింది. ఈ పరిస్థితుల్లో గ్రామ గిరిజనులు ప్రాణాలకు తెగించి సాహసం చేశారు. ఆమెను మోసుకుని వాగు దాటించారు. అక్కడి నుంచి కోరుకొండలోని ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఆమె వైద్యసేవలు పొందుతోంది.

సూపర్ సిక్స్ అంటే భయమెందుకు బాబూ..

- అసెంబ్లీ సాక్షిగా మాట తప్పిన సీఎం
- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం



సాక్షి,పాడేరు: ఎన్నికల్లో తప్పుడు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇప్పుడు సూపర్ సిక్స్ పథకాలంటేనే భయమేస్తోందని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించడం దారుణమని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ధ్వజమెత్తారు.శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు అనేక తప్పుడు హామీలిచ్చి కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. రైతులకు రైతుభరోసా సాయంతో పాటు విద్యార్థుల తల్లులకు అమ్మఒడి సాయం ఇంతవరకు పంపిణీ చేయకపోవడం భావ్యం కాదన్నారు. ప్రతి రైతుకు రూ.20వేల పెట్టుబడి సాయం పంపిణీ చేస్తానన్న చంద్రబాబు ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా పంపిణీ చేయకపోవడం అన్యాయమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉంటే ఇప్పటికే అమ్మ ఒడి ఆర్థికసాయం 15వేలతో పాటు రైతు భరోసా కూడా పంపిణీ జరిగి ఉండేదన్నారు.పాఠశాలకు వెళ్లే ప్రతి బిడ్డకు రూ.15వేల చొప్పున ఆతల్లికి ఎంత మంది పిల్లలు ఉన్న అమ్మకు వందనం అమలు చేస్తామన్న చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తరువాత మాట తప్పారన్నారు. ఈఏడాది అమ్మకు వందనం లేదంటూ మంత్రి లోకేష్ ప్రకటించడం సమంజసం కాదన్నారు. నిరుద్యోగ భృతి, ఉద్యోగాల కల్పన, మహిళలకు ఆర్థిక సాయం, వారికి ఉచిత బస్సు ప్రయాణం వంటి హామీలన్నింటిని అమలు జేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయన్నారు. అయితే సీఎం చంద్రబాబు మాత్రం వాటిని తప్పించుకునే ధోరణితో వ్యవహరించడం దారుణమన్నారు. గిరిజన ప్రాంతాల్లో జీవో నంబరు 3 పునరుద్ధరణ,ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వలంటీర్ల నియమాకాలపై హామీ ఇచ్చిన చంద్రబాబు వాటిని కూడా ఇంతవరకు పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు.అమరావతి అభివృద్ధికి కేంద్రం అప్పులు మాత్రమే ఇస్తుందని, అదంతా ప్రజలపైనే భారం పడుతుందన్నారు. కేంద్రం ఉచిత సాయం చేస్తున్నట్టు కూటమి నేతలు పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్యే విమర్శించారు.

ఏవోబీలో కూంబింగ్ ముమ్మరం

- నేటి నుంచి మావోయిస్టు అమరవీరుల వారోత్సవాలు
- అప్రమత్తమైన బలగాలు
- బాబు స్క్వాడ్‌లతో ముమ్మరంగా తనిఖీలు

ముంచంగిపుట్టు: ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతంలో శనివారం పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఆదివారం నుంచి వచ్చే నెల మూడవ తేదీ వరకు మావోయిస్టు అమరవీరుల వారోత్సవాల నేపథ్యంలో అప్రమత్తమయ్యారు. స్థానిక ఎస్‌ఐ కె.రవీంద్ర ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు జోలాపుట్టు వెళ్లే మార్గంలో అనుమానితులను ప్రశ్నించి విడిచిపెట్టారు. సీఆర్‌పీఎఫ్ పోలీసులు ముంచంగిపుట్టు నుంచి బాపనపుట్టు, కర్రిముఖిపుట్టు ప్రాంతాల్లో కల్వర్టులు, వంతెనలను బాబు స్క్వాడ్‌తో పరిశీలించారు. సరిహద్దు ప్రాంతమైన జోలాపుట్టు, మాచ్‌ఖండ్, ఒనకఢిల్లీ ప్రాంతాల్లో బీఎస్‌ఎఫ్ బలగాలు నిఘా పెంచాయి. మావోయిస్టు హిట్ లిస్ట్‌లో ఉన్నవారికి సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, ఎటువెళ్లినా తమకు సమాచారం అందించాలని, ముందస్తుగానే పోలీసులు నోటీసులు జారీ చేశారు. కొత్త వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దని, అనుమానంగా తిరిగే వ్యక్తులు ఎవరు వచ్చినా తమకు తెలియజేయాలని పోలీసులు సూచించారు.



జోలాపుట్టు మార్గంలో వాహన తనిఖీలు

కొయ్యూరు: వారోత్సవాల నేపథ్యంలో పోలీసులు కూంబింగ్ ముమ్మరం చేశారు. వాహన తనిఖీలు చేపట్టడమే కాకుండా అనుమానితులను విచారించి వదిలిపెడుతున్నారు. మరోవైపు ప్రజాప్రతినిధులు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఇతర ప్రాంతాలకు వెళ్లవద్దని సూచించారు. వారోత్సవాల నేపథ్యంలో శనివారం నుంచి బూదరాళ్ల,మంప, రేవళ్లు వెళ్లాల్సిన బస్సులను కొయ్యూరు వరకు మాత్రమే నడుస్తాయి. మంప ఎస్‌ఐ లోకేష్ ఆధ్వర్యంలో శనివారం చింతవానిపాలెం-బాలరేవుల రహదారిలో తనిఖీలు చేపట్టారు.



కూంబింగ్‌కు బయలుదేరిన బలగాలు

రంపచోడవరం ఐటీడీఏ పీవోగా కట్టా సింహాచలం బాధ్యతలు

రంపచోడవరం: స్థానిక ఐటీడీఏ పీవోగా కట్టా సింహాచలం శనివారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా సీతపల్లి గడి బాపనమ్మ, ఐ. పోలవరం సమీపంలోని వేంకటేశ్వర స్వామి ఆలయాలన్లో పూజలు చేశారు. అనంతరం ఏపీవో జనరల్ సీహెచ్ శ్రీనివాసరావు, ఏవో డీఎస్‌వీ రమణ, ఇతర అధికారులు పీవోను మర్యాద పూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో గిరిజనుల సమస్యలు పరిష్కరించే విధంగా సిటిజన్ ఎంగేజ్ టీములు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి ఎప్పటికప్పుడు అందేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజన ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపించే విధంగా అధికారులతో, సిబ్బందితో సమన్వయంతో పనిచేస్తామని తెలిపారు. ఐ.పోలవరం సమీపంలోని తిరుమల తిరుపతి దేవస్థానం గుడి దగ్గర కల్యాణ మండపం కోసం స్థలం కావాలని పూజారులు కోరారని, తగు చర్యలు తీసుకుంటామన్నారు.



ఐటీడీఏ పీవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న కట్టా సింహాచలం



విశాఖ: జెడ్పీ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, చిత్రంలో విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల కలెక్టర్లు, జెడ్పీ సీఈవో

అన్నదాతకు పెట్టుబడి సాయం ఎప్పుడు?

8లో

ప్రభుత్వం ఏర్పడి 45 రోజులు గడిచిపోయింది. ఇప్పటికీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీపై ఉలుకూ..పలుకూ లేదు.. పెట్టుబడి సాయం ఎప్పుడు ఇచ్చేది అంటూ జెడ్పీ వైస్‌చైర్మన్ గిరిబాబు, బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సమావేశం విశాఖలోని జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన వాడీవేడిగా సాగింది.

నేడు మోదమ్మ శాకంబరి ఉత్సవం


మోదకొండమ్మతల్లి

సాక్షి,పాడేరు: గిరిజనుల ఇలవేల్పు పాడేరు మోద కొండమ్మతల్లికి ఆదివారం శాకంబరి ఉత్సవాన్ని నిర్వ హించనున్నారు. ఈమేరకు ఆలయ కమిటీ చైర్మన్, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబునాయుడు, కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లను పూర్తి చేశారు. అమ్మవారి అలంకరణకు సంబంధించి భారీగా కూరగాయలు, ఆకుకూరలు, వివిధ రకాల పండ్లను అలంకరణకు ఉపయోగిస్తున్నారు. ఆదివారం ఉదయం ఐదు గంటల నుంచి అమ్మవారు శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారని ఆలయ అర్చకుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మత్స్యరాస విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ ఉత్సవం సందర్భంగా మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో భక్తులకు భారీ అన్నసమారాధన నిర్వహిస్తున్నామన్నారు. అన్ని వర్గాల భక్తులు మోదకొండమ్మతల్లిని దర్శించుకుని, మధ్యా హ్నం అమ్మవారి ప్రసాదం స్వీకరించాలని ఆయన కోరారు.

పిచ్చికుక్క స్వైర విహారం

- ఐదుగురికి తీవ్ర గాయాలు


ముంచంగిపుట్టులో పిచ్చికుక్క దాడిలో ఓ బాధితుడి కాళ్లకి తీవ్ర గాయాలు

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో గత రెండు రోజులుగా పిచ్చికుక్క స్వైర విహారం చేసి ఐదుగురికి గాయాలు చేసింది. శనివారం రాత్రి అంబేడ్కర్ పార్కు సమీపంలో ఇద్దరి యువకులపై పిచ్చికుక్క దాడి చేయగా ఆదివారం ఉదయం మరో ముగ్గురు వ్యక్తులపై దాడి చేసి గాయాల పాలు చేసింది.దీంతో మండల కేంద్ర వాసులు భయందోళనకు గురవుతున్నారు. నలువురంగులో ఉన్న పిచ్చకుక్క వరసగా దాడి చేస్తూ ఉండడంతో బయట తిరిగేందుకు స్థానికులు ఆందోళన చేదుతున్నారు.పిచ్చకుక్క దాడి చేసిన బాధితులకు స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారి గీతాంజలి వైద్య సేవలు అందించారు. మండల కేంద్రంలో పిచ్చికుక్క సంచరిస్తున్న తరుణంలో స్థానికులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి పిచ్చికుక్క నుంచి రక్షించాలని బాధితులు కోరుతున్నారు.

అన్నదాతకు పెట్టుబడి సాయం ఎప్పుడు?


పాడేరు ఎమ్మెల్యే మత్సరాస విశ్వేశ్వరరాజు దంపతులను సన్మానిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, జీకే వీధి జెడ్పీటీసీ సభ్యురాలు శివరత్నం


సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, అరకు , పాడేరు ఎమ్మెల్యేలు మత్స్యలింగం, విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్యేలు

- గత ప్రభుత్వ హయాంలో ఈపాటికే రైతు భరోసా అందింది
- నకిలీ విత్తనాలపై మండిపడ్డ జెడ్పీ వైస్ చైర్మన్, జెడ్పీటీసీ సభ్యులు
- యలమంచిలి ఎమ్మెల్యే వ్యాఖ్యలపై ఘాటుగా బదులిచ్చిన జెడ్పీటీసీలు
- దీంతో కాసేపు సభ రసాభాస.. వాడీవేడిగా జిల్లా పరిషత్ సమావేశం


సమావేశంలో వాగ్వాదానికి దిగిన యలమంచిలి జనసేన ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, కొయ్యూరు వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజు


సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

సాక్షి, విశాఖపట్నం: 'ఖరీఫ్ సీజన్ నాటికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పెట్టుబడికి వైఎస్సార్ రైతు భరోసా అందింది. పంటల బీమా సౌకర్యం కల్పించారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 45 రోజులు గడిచిపోయింది. ఇప్పటికీ ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీపై ఉలుకూ..పలుకూ లేదు.. ప్రభుత్వం సరఫరా చేసిన నకిలీ విత్తనాలతో రైతులు నిండా మునిగిపోయారు. రాజకీయాలు మాని.. ప్రజల సమస్యలు, రైతుల శ్రేయస్సుపై దృష్టి పెట్టండి.'అంటూ జెడ్పీ వైస్‌చైర్మన్ గిరిబాబు, బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇసుక ఉచితమని చెప్పి.. డబ్బులు ఎందుకు వసూళ్లు చేస్తున్నారని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సమావేశం విశాఖలోని జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో శనివారం చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన వాడీవేడిగా సాగింది. ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి జెడ్పీ చైర్‌పర్సన్, సీఈవో పోలినాయుడు, జిల్లా అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత అజెండాను సీఈవో చదివి వినిపించారు. ఈ సందర్భంగా పలు శాఖలపై చర్చించారు. అజెండాలో 156 అంశాలు చేర్చినప్పటికీ.. ప్రధానంగా వ్యవసాయం, సీజనల్ వ్యాధులు, ఇసుక పాలసీ, పర్యాటకం, విద్యావ్యవస్థపై చర్చ సాగింది. సమా వేశం ప్రారంభమైన కొద్ది సేపటికి యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ గత ప్రభుత్వంపై విమర్శలు చేయగా.. జెడ్పీ వైస్ చైర్మన్ గిరిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు రాంబాబు తిప్పికొట్టారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగానే నిధులు కొరత వచ్చిందని ఎమ్మెల్యే మాట్లాడగా.. వారు జోక్యం చేసుకుని రాజకీయాలు మాని.. ప్రజా సమస్యల పరిష్కారం, రైతుల శ్రేయస్సు కోసం మాట్లాడితే మంచిదని బదులిచ్చారు. దీంతో ఇరువర్గాల మధ్య కొంత సేపు వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ వేదికపై నుంచి దిగివచ్చి సభ్యులను వారించే ప్రయత్నం చేశారు. ఇరువర్గాలు వెనక్కి తగ్గకపోవడంతో.. సమావేశానికి అంతరాయం కలిగించాలనుకుంటే బయటకు వెళ్లిపోవచ్చని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నాణ్యత లేని విత్తనాల సరఫరా

'ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది.. వర్షాలు విస్తృతంగా కురుస్తున్నాయి. రైతులు వరినాట్లకు సిద్ధంగా ఉన్నారు. కానీ ప్రభుత్వం నాణ్యత లేని విత్తనాలు సరఫరా చేస్తోంది. పొల్లు విత్తనాలు ఇచ్చారు'అంటూ అల్లూరి జిల్లా జెడ్పీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నష్టం వాటిల్లిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కొయ్యూరు జెడ్పీటీసీ సభ్యుడు వార నూకరాజు డిమాండ్ చేశారు. విపత్తుల నుంచి రైతులను కాపాడేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఉచితం బీమా కల్పించిందని, ప్రస్తుత ప్రభుత్వం మాత్రం ఈ-క్రాప్‌పై స్పష్టత ఇవ్వలేదన్నారు. ఈ-క్రాప్ నమోదు చేసి ప్రీమియం ప్రభుత్వం చెల్లించాలన్నారు. ఈ-క్రాప్ నమోదు చేసుకోకుంటే ధాన్యం కొనుగోలు చేపట్టరని ఎమ్మెల్సీ కల్యాణి, ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. అయితే ఈ-క్రాప్‌పై ప్రభుత్వం నుంచి ఎటువంటి మార్గదర్శకాలు లేవని అధికారులు తెలిపారు. అరకు ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రజాప్రతినిధుల పట్ల వైద్యాధికారులు మర్యాద లేకుండా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం ఆగ్రహం వ్యక్తం చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్యాధికారితో మాట్లాడాలని వస్తే తనకు ఎదురైన అనుభవం ఇదన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించాల్సిన బాధ్యత వైద్యాధికారులపై ఉందని స్పష్టం చేశారు.

పాఠశాలల్లో గంజాయిపై ప్రత్యేక నిఘా

విద్యా, వైద్య, వ్యవసాయ రంగాల్లో సేవలను మరింత విస్తృతం చేయాలని చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధికారులను ఆదేశించారు. చిన్నారుల భవిష్యత్‌కు భరోసా ఇవ్వాలని, పాఠశాలల్లో గంజాయి వినియోగంపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచించారు. ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపట్టాలని, డ్రై డే డ్రైడే కచ్చితంగా పాటించాలన్నారు. కేజీహెచ్‌లో నాణ్యమైన వైద్య సేవలందించాలన్నారు. అన్ని ఆస్పత్రుల్లో అవసరాలకు సరిపడా మందులను అందుబాటులో ఉండాలని, పాఠశాలలు, వసతిగృహాల్లో సేవలను మెరుగుపరచాలని ఆదేశించారు.

సమావేశంలో ముఖ్యాంశాలు

- ఇటీవల మృతి చెందిన రావికమతం జెడ్పీటీసీ సభ్యురాలు తలారి రమణమ్మకు సభ్యులు సంతాపం తెలిపి.. ఆమె సేవలను గుర్తు చేసుకున్నారు.
- నూతన ఎమ్మెల్యేలను జెడ్పీ చైర్‌పర్సన్, కలెక్టర్లు, జెడ్పీటీసీ సభ్యులు ఘనంగా సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.
- ఏపీ మినిస్టీరియల్ రూల్స్ ప్రకారం జెడ్పీ పరిధిలోని జూనియర్ అసిస్టెంట్ కమ్ క్లర్క్, టైపిస్ట్ కమ్ క్లర్క్ పేర్లను జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్‌గా, సీనియర్ అసిస్టెంట్ పేరును సీనియర్ ఆఫీస్ అసిస్టెంట్‌గా మార్పు చేసినట్లు సీఈవో వెల్లడించారు.
- జెడ్పీ పరిధిలోని ఏడు స్థాయీ సంఘాలకు నూతన సభ్యులను ఎంపిక చేస్తూ చైర్‌పర్సన్ ప్రతిపాదనలు చేయగా.. సభ్యులందరూ ఆమోదించారు. నూతన ఎమ్మెల్యేలను ఆయా కమిటీలకు ఎంపిక చేస్తూ సభ నిర్ణయం తీసుకుంది.
- ఫసల్ బీమా యోజన సేవలను రైతులకు చేరువ చేయాలని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు.
- ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ కోరారు.
- చోడవరం మండలం గంధవరంలోని విత్తన పరిశోధన కేంద్రాన్ని త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.రాజు ఆదేశించారు.
- కేజీహెచ్ సేవలను విస్తృతం చేయాలని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు కోరారు.
- ఎమ్మెల్యే మత్సరాస విశ్వేశ్వరరాజు మూడు జిల్లాల కలెక్టర్లు ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్, విజయకృష్ణన్, దినేష్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు హాజరయ్యారు.

పెరుగుతున్న నీటిమట్టాలు

- డుడుమ, జోలాపుట్టుకు భారీగా వరద నీరు
- బలిమెలకు నాలుగు వేల క్యూసెక్కుల విడుదల


డుడుమ నుంచి దిగువన ఉన్న బలిమెలకు విడుదల చేస్తున్న నీరు

ముంచంగిపుట్టు: ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న మాచ్ ఖండ్ జల విద్యుత్ కేంద్రానికి నీరందించే ప్రధాన డుడుమ జలాశయానికి వరద నీటి ప్రవాహం తగ్గడం లేదు. సరిహద్దులో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలకు జలాశయంలో నీటి నిల్వ క్రమేపీ పెరుగుతూ ప్రమాదస్థాయికి చేరుకుంది. డుడుమ జలాశయ నీటి సామర్థ్యం 2,590 అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 2,589 అడుగులు నీటి నిల్వ నమోదయింది. నీటి నిల్వ ప్రమాదస్థాయికి చేరుకోవడంతో జలశయానికి సంబంధించిన 6,7 నెంబర్లు గల గేట్లు ఎత్తి దిగువున ఉన్న బలిమెల జలాశయానికి నాలుగు వేల క్యూసెక్కుల నీటిని గత రెండు రోజులుగా విడుదల చేస్తున్నారు.

పెరుగుతున్న జోలాపుట్టు నీటిమట్టం : జోలాపుట్టు జలాశయంలో నీటి నిల్వలు పెరుగుతున ఉనాయి. ఈ ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 2,750 అడుగులు కాగా శనివారం నాటికి 2,730 అడుగులుగా నమోదు అయింది. ఇరు రాష్ట్రాల సరిహద్దులో భారీగా వర్షాలు కురుస్తుండటంతో జలాశయ నీటిమట్టాన్ని సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. మాచ్‌ఖండ్ జల విద్యుత్ కేంద్రంలో రెండు జనరేటర్ల సహాయంతో 46 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి అవుతుందని ప్రాజెక్టు అధికారవర్గాలు తెలిపాయి.

వరద ఉధృతితో ఆగిన అంబులెన్స్


గిన్నెగరువు గ్రామంలో వైద్యసేవలందిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది


గిన్నెగరువు వంతెన దాటలేక నిలిపివేసిన గోమంగి పీహెచ్‌సీ అంబులెన్స్

- గిన్నెగరువు గెడ్డ వంతెనపై 3 గంటల పాటు నిరీక్షణ
- గ్రామంలో వైద్య సేవలందించి వెళ్తుండగా ఘటన

పెదబయలు: మండలంలో గోమంగి వైద్యాధికారులు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శనివారం ఉదయం గిన్నెగరువు గ్రామానికి చేరుకుని, ఇక్కడ వైద్య శిబిరం ఏర్పాటు చేసి మధ్యాహ్నం 3 గంటలకు తిరుగు పయనమయ్యారు. ఈ క్రమంలో ఎగువన కురిసిన భారీ వర్షానికి గిన్నెగరువు వంతెనపై వరద నీరు పొంగి ప్రవహించింది. దాంతో మూడు గంటల పాటు నిరీక్షించాల్సి వచ్చింది. వంతెనపై సాయంత్రం 5.45 గంటలకు వరద ఉధృతి తగ్గడంతో అంబులెన్స్ వంతెన దాటిందని వైద్య సిబ్బంది తెలిపారు. తొలుత ఇంజరి పంచాయతీ గిన్నెగరువు గ్రామంలో 58 రోగులను వైద్యాధికారులు చైతన్యవర్మ, కిరణ్‌కుమార్ పరీక్షించారు. వీరిలో 11 డయేరియా కేసులు, వైరల్ ఫీవర్ కేసులు 34, బీపీ 5, చర్మ వ్యాధులకు సంబంధించి 8 కేసులు నమోదయ్యాయి. డయేరియా బాధితులకు వైద్యం అందించడంతో ప్రస్తుతం అదుపులోనే ఉందన్నారు. అనంతరం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని, వేడిగా ఆహారం తీసుకోవాలని సూచించారు. ఆశ కార్యకర్త దగ్గరుండి ప్రతీ రోజు మందులు వాడించాలన్నారు. ఇంజరి గ్రామ సచివాలయ సిబ్బంది, గోమంగి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్పెషల్ రైళ్ల పొడిగింపు

తాటిచెట్లపాలెం (విశాఖ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రస్తుతం నడుస్తున్న స్పెషల్ రైళ్లు మరింత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు.

ప్రతీ గురువారాల్లో హౌరాలో బయల్దేరే హౌరా-యశ్వంత్‌పూర్(02863) స్పెషల్ ఆగష్టు 15వ తేదీ వరకు, తిరుగు ప్రయాణంలో యశ్వంత్‌పూర్‌లో ప్రతీ శనివారం బయల్దేరే యశ్వంత్‌పూర్-హౌరా(02864) స్పెషల్ ఆగష్టు 17వ తేదీ వరకు పొడిగించారు.

గుంటూరు డివిజన్ విష్ణుపురం-కొండ్రపోల్ మధ్య ట్రాఫిక్ బ్లాక్ తీసుకుంటున్నందున ఆయా తేదీల్లో సంత్రగచ్చి-సికింద్రాబాద్ స్పెషల్ రైళ్లు దారి మళ్లిస్తున్నట్లు రైల్వే అధికారుల తెలిపారు.

సంత్రగచ్చిలో ఆగష్టు 11వ తేదీన బయల్దేరే సంత్రగచ్చి-సికింద్రాబాద్(07222) స్పెషల్, తిరుగ ప్రయాణంలో ఆగష్టు 13వ తేదీన సికింద్రాబాద్‌లో బయల్దేరే సికింద్రాబద్-సంత్రగచ్చి (07221) స్పెషల్ రెగ్యులర్‌మార్గంలో కాకుండా వయా విజయవాడ, వరంగల్, కాజీపేట మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

- గుంటూరు డివిజన్‌లో పనుల నిమిత్తం వచ్చే నెల 12,13 తేదీల్లో విశాఖ నుంచి బయల్దేరే విశాఖ-లింగంపల్లి (12805) జన్మభూమి ఎక్స్‌ప్రెస్ మార్గమధ్యలో ఆయా స్టేషన్‌లలో సుమారు 45 నిమిషాలు నిలిపివేయనున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు.


వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



పడవపై వరద ముంపు గ్రామాలకు వెళ్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

వీఆర్ పురం: వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని చినమట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు, వైఎస్సార్‌సీపీ మండల వైస్ కన్వీనర్ చిక్కాల బాలు ఆరోపించారు. మండలంలోని వరద ప్రభావిత పంచాయతీలైన చినమట్టపల్లి , రామవరం పంచాయతీల్లోని ముంపు గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి శనివారం వారు పర్యటించి, వరద బాధితులతో మాట్లాడారు. నెలా నెలా ఇచ్చే రేషన్ బియ్యం ఇచ్చారు తప్ప వరద సరకులు ఇవ్వలేదని , ఇళ్లలోకి నీరు చేరడంతో సమీపంలోని గుట్టలే ఆవాసానికి దిక్కయ్యాని ఆయా గ్రామాల్లోని వరద బాధితులు గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వరదలు వచ్చి సుమారు పది రోజులు కావస్తున్నా బాధితులకు ప్రభుత్వం కనీసం వరద బియ్యం ఇవ్వకపోవటం చాల బాధాకరమన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వరద పట్ల చాలా అప్రమత్తంగా ఉండి వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకుందని గుర్తు చేశారు. పలురకాల కూరగాయలు వంకాయలు, బెండకాయలు, టమాటా, పచ్చిమిర్చి, దుంపలు, క్యాబేజి, ఆనపకాయలతో పాటు పాలు, బిస్కెట్, నిత్యావసర సరుకులు ఇచ్చిందన్నారు. అంతే కాకుండా రూ.2 వేలు తక్షణ సహాయం కింద మండలంలోని కార్డు దారులందరికీ ఇచ్చి వరద బాధితులను గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆదుకుందని గుర్తు చేశారు. .కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో కనీస సాయం లేదన్నారు. వరద బాధితులు అధికారులను టార్పాలిన్లు కోసం అడిగితే గత సంవత్సరం ఇచ్చాము కదా అని చెప్పటం విడ్డురంగా ఉందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన టార్పాలిన్లు వరదల్లోనే వినియోగించడంతో చిరిగిపోయి ఉంటుందని, అధికారులు ఆ విషయాన్ని తెలుసుకొని ప్రస్తుతం బాధితులకు టార్పాలిన్లు అందచేయాలన్నారు. వరదలు వచ్చి 10 రోజులు కావస్తుందని ఒకసారి మాత్రమే నిత్యావసరాలు ఇచ్చారని, అవి కూడా అరకొరగా అందజేశారని విమర్శించారు. ముంపు గ్రామాల ప్రజలందరికి నిత్యావసరాలు, దోమతెరలు ఇవ్వాలని వారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన తక్షణ సహాయాన్ని అందరికి వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. అలాగే పోలవరం ముంపు గ్రామాలకు ప్రభుత్వం నష్టం పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. అరకు పార్లమెంట్ కార్యదర్శి బొడ్డు సత్యనారాయణ, నాయకులు కోటం జయరాజు, ఎస్సీ సెల్ నాయకులు చీమల కాంతారావు, మాచర్ల వెంగలరావు, మోడెం నరేష్,రేవు బాలరాజు వార్డు సభ్యులు గూటలా నవీన్, గుటల ముత్యాలరావు,మిల్లు దుర్గరావు తదితరులు పాల్గొన్నారు.

జయవర్దన్ మృతదేహం కోసం గాలింపు

- రంగంలోకి దిగిన ఎస్డీఆర్ఎఫ్ బృందం
- ఆచూకీ లేక కుటుంబ సభ్యుల్లో ఆందోళన


గాదేగుమ్మిలో గాలింపు చేపట్టిన ఎస్డీఆర్ఎఫ్ బృందం


కత్తిరాలలొద్ది కాలువను పరిశీలిస్తున్న బృందం

కొయ్యూరు: కాలువలో ఈ నెల 21న గల్లంతయిన రీమెల జయవర్దన్ జాడ లభ్యం కాలేదు. బాధిత కుటుంబ సభ్యులు కలెక్టర్ దినేష్‌కుమార్‌కు శుక్రవారం ఫిర్యాదు చేయగా, విజయనగరం నుంచి రాష్ట్ర విపత్తుల నిర్వాహణ సంస్థ(ఎస్డీఆర్ఎఫ్)కు చెందిన 21 మంది సభ్యుల బృందం రంగంలోకి దిగింది. శనివారం తీగలమెట్ట కాలువ వెంబడి గాలించింది. మొదట కత్తిరాలలొద్ది కాలువ నుంచి జల్లెడ పట్టింది. అనుమానం వచ్చిన చోట కాలువలోకి దిగి గాలించినా ఆచూకీ దొరక లేదు. ఎక్కువ మంది గాదేగుమ్మి చాలా మంది మరణించారు. దీంతో రెండు గంటలపాటు వెతికినా జాడ తెలియలేదు. దీంతో కాలువ ప్రవహించే రామరాసుపాలెం, పెదమాకవరం, భీమవరం ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టింది. ఈ కాలువ తాండవకు ప్రధాన ఇన్ ఫ్లోగా ఉంది. దీంతో కాలువ ప్రవహించే ఐదు కిలోమీటర్ల దూరం వరకు గాలించింది. గల్లంతై ఏడు రోజులు కావడంతో మృతదేహం చాలా వరకు పాడై ఉంటుందని అనుమానిస్తున్నారు. దీంతోపాటు తాండవ జలాశయంలో అప్రమత్తం చేశారు. అక్కడా లభ్యం కాలేదు. తహసీల్దారు రాజేశ్వరరావు, సీఐ వెంకటరమణ, కొయ్యూరు ఎస్ఐ రామకృష్ణ ఈ బృందంతో కలిసి తిరిగారు. తగిన సలహాలు, సూచనలు చేశారు. మరో వైపు జయవర్దన్ ఆచూకీ లభించక కుటుంబ సభ్యుల్లో రోజు రోజుకు ఆందోళన పెరుగుతోంది.